సాక్షి
నిజామాబాద్

బుధవారం । 11 । సెప్టెంబర్ । 2024



పది రోజుల్లో 105 టీఎంసీలు..
ఎస్సారెస్పీలోకి ఎగువ నుంచి పది రోజుల్లో 105 టీఎంసీల ఇన్‌ఫ్లో రాగా, ఈ సీజన్‌లో మొత్తం 170 టీఎంసీల ఇన్‌ఫ్లో వచ్చింది.
- 8లో ▸



ఎన్‌సీసీతో ఉజ్వల భవిష్యత్
ఎన్‌సీసీతో ఉజ్వల భవిష్యత్ ఉంటుందని తెలంగాణ, ఆంధ్ర డిప్యూటీ డైరెక్టర్ జనరల్ ఎయిర్ కమాండర్ ఎంవీ రెడ్డి అన్నారు.
- 8లో ▸

గరిష్టం/కనిష్టం
27.1 /23.1

వాతావరణం
ఉదయం చల్లని గాలులు వీస్తాయి. ఆకాశం మేఘావృతమవుతుంది. అక్కడక్కడ ఓ మోస్తరు వర్షం కురిసే అవకాశాలున్నాయి.

న్యూస్‌రీల్

కృత్రిమ కొరత సృష్టిస్తే డీలర్‌షిప్ రద్దు



వర్ని: ఎరువులను రైతులకు అందుబాటులో ఉంచాలని, కృత్రిమ కొరత సృష్టిస్తే డీలర్‌షిప్‌ను రద్దు చేస్తామని జిల్లా వ్యవసాయ శాఖ అధికారి వాజిద్ హుస్సేన్ అన్నారు. మండల కేంద్రంలోని ఎరువులు, ఫెర్టిలైజర్ దుకాణాలను మంగళవారం ఆయన తనిఖీ చేశారు. పీవోఎస్ మిషన్ ద్వారానే ఎరువులు విక్రయించాలని స్పష్టం చేశారు. ఆయనవెంట ఏఈవో అరుణ్ ఉన్నారు.

యువత రక్తదానం చేయాలి



నిజామాబాద్ నాగారం: జిల్లాలో రక్తనిల్వల కొరత తీవ్రంగా ఉందని, గణేశ్ మండపాల వద్ద యువకులు అన్నదానంతోపాటు రక్తదాన శిబిరాలు ఏర్పాటు చేయాలని రెడ్‌క్రాస్ సొసైటీ చైర్మన్ బుస్సా ఆంజనేయులు మంగళవారం ఒక ప్రకటనలో కోరారు. రక్తదానంతో తలసేమియా బాధిత పిల్లలు, డెంగీ బారిన పడిన వారి ప్రాణాలను కాపాడే అవకాశం కలుగుతుందని పేర్కొన్నారు. వినాయక ఉత్సవాల్లో కీలకపాత్ర పోషించే యువకులు రక్తదానంపై దృష్టి పెట్టాలన్నారు. రెడ్‌క్రాస్ కుటుంబ సభ్యులు, మండల డివిజన్, జిల్లా కమిటీల బాధ్యులు రక్తదాన శిబిరాలు నిర్వహించేలా చొరవ చూపాలని కోరారు.

పర్వతారోహకుడికి సన్మానం



నవీపేట: రష్యాలోని ఎల్బ్రస్ పర్వతాన్ని అధిరోహించిన మండలంలోని నాళేశ్వర్‌కు చెందిన ఆర్మూర్ మారుతిని కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతు, సీపీ కల్మేశ్వర్, బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి మంగళవారం జిల్లా కేంద్రంలో ఘనంగా సన్మానించారు. ప్రపంచంలోని ఆయా ప్రాంతాలతోపాటు దేశంలోని ఎత్తైన పర్వతాలను అధిరోహించిన మారుతి.. మరిన్ని రికార్డులు సాధించాలని వారు ఆకాంక్షించారు.

13న ఉమ్మడి జిల్లా స్థాయి కరాటే పోటీలు

కామారెడ్డి టౌన్: స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో ఈనెల 13న దోమకొండలోని ముదిరాజ్ ఫంక్షన్ హాల్‌లో ఉమ్మడి జిల్లా స్థాయి కరాటే పోటీలు నిర్వహించనున్నారు. ఈ విషయాన్ని జిల్లా క్రీడల కార్యదర్శి హీరాలాల్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ పోటీలలో సత్తాచాటినవారిని రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక చేస్తామని పేర్కొన్నారు. ఆసక్తిగల 17 ఏళ్లలోపు బాలబాలికలు ఒరిజినల్ బోనఫైడ్, ఆధార్‌కార్డులను తీసుకుని పోటీలకు రావాలని సూచించారు.

బీసీల రిజర్వేషన్ శాతాన్ని పెంచాలి

- రాజ్యసభ సభ్యుడు ఆర్ కృష్ణయ్య



పెర్కిట్: కాంగ్రెస్ ప్రభుత్వం మ్యానిఫెస్టో ప్రకారం వెంటనే కులగణన చేపట్టి స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీల రిజర్వేషన్ శాతాన్ని 20 నుంచి 42 శాతం పెంచాలని బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు, రాజ్యసభ సభ్యుడు ఆర్ కృష్ణయ్య డిమాండ్ చేశారు. మున్సిపల్ పరిధిలోని పెర్కిట్‌లో మంగళవారం నిర్వహించిన బీసీ సదస్సుకు ఆయన హాజరై మాట్లాడారు. కాంగ్రెస్ అధికారం చేపట్టి 8 నెలలు గడుస్తున్నా ఇప్పటి వరకు కులగణనపై ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదన్నారు. వెంటనే కుల గణన చేపట్టి బీసీల రిజర్వేషన్ శాతాన్ని పెంచాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో రిటైర్డ్ ఐఏఎస్ చిరంజీవులు, బీసీ జనసభ రాష్ట్ర అధ్యక్షుడు రాజారాం యాదవ్, కొండవీటి శ్యామ్ ప్రసాద్, సిద్దేశ్వర్, దేగాం యాదాగౌడ్, మోతె రామాగౌడ్, అశోక్, కామని రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.



మనోహరాబాద్‌లో షెడ్డు, యంత్రాలు

సేద్యంతో పాటు
ఎగుమతులు

కంపెనీ చట్టం కింద రైతు ఉత్పత్తి దారుల సంఘం
- రాష్ట్రంలోనే తొలిసారిగా ఏర్పాటు
- జేఎంకేపీఎం పేరుతో నమోదు
- పంటకు అదనపు విలువ జోడించి మార్కెట్ చేసేందుకు రంగం సిద్ధం
- మనోహరాబాద్‌లో యంత్రాలు.. ప్రయోగశాల, గోదాము నిర్మాణం
- ఆత్మనిర్భర్ పథకం కింద ఎంఎస్ఎంఈ ద్వారా 600 మంది రైతులతో యూనిట్
- ఏడాదిలో రూ.100 కోట్లు, ఐదేళ్లలో రూ.500 కోట్ల టర్నోవర్ లక్ష్యం

జక్రాన్‌పల్లి మండలంలోని ఐదు గ్రామాలకు చెందిన రైతులు రాష్ట్రంలోనే మొదటిసారిగా 2013 కంపెనీల చట్టం కింద 'రైతు ఉత్పత్తిదారుల సంఘం' (ఎఫ్‌పీవో) ఏర్పాటు చేసుకున్నారు. పొలాల వద్ద నుంచే పంట ఉత్పత్తులకు అదనపు విలువ జోడించి అంతర్జాతీయ ఎగుమతులు చేయడమే లక్ష్యం కాగా, ఆ మేరకు రంగం సిద్ధం చేసుకుంటున్నారు.

సాక్షి ప్రతినిధి, నిజామాబాద్: సేద్యం చేసి పంట ఉత్పత్తులు తీయడంలో ముందున్న రైతులు తమ పొలాల వద్ద నుంచే అదనపు విలువ జోడించి అంతర్జాతీయ ఎగుమతులు చేసేందుకు రంగం సిద్ధం చేసుకుంటున్నారు. ఇందులో భాగంగా జిల్లాలోని జక్రాన్‌పల్లి మండలంలోని 5 గ్రామాలకు చెందిన 600 మంది రైతులు 'రైతు ఉత్పత్తిదారుల సంఘం' (ఎఫ్‌పీవో) ఏర్పాటు చేసుకున్నారు. తమ ఊరి పేరులోని మొదటి ఆంగ్ల అక్షరంతో జేఎంకేపీఎం (జక్రాన్‌పల్లి, మనోహరాబాద్, కలిగోట్, పడకల్, మైలారం) అనే పేరుతో ఈ ఎఫ్‌పీవో ను ఏర్పాటు చేసుకున్నారు. కేంద్ర ప్రభుత్వ ఆత్మనిర్భర్ పథకం కింద ఎంఎస్ఎంఈ ద్వారా యూనిట్ ఏర్పాటు చేసుకున్నారు. ఈ ఎఫ్‌పీవోను తెలంగాణ రాష్ట్రంలోనే మొదటిసారిగా 2013 కంపెనీల చట్టం కింద 2021 ఏప్రిల్‌లో నమోదు చేసుకున్నారు. రాష్ట్రంలో నాబార్డ్ ద్వారా మొత్తం 84 ఎఫ్‌పీవోలు ఉండగా, ప్రత్యేకంగా ఈ జేఎంకేపీఎం ఎఫ్‌పీవో మాత్రమే కంపెనీ చట్టం కింద నమోదు కావడం విశేషం. ఇందులో భాగంగా మొదటగా పసుపు పంటకు అదనపు విలువ జోడించి నేరుగా ఎగుమతులు చేసేందుకు తగిన ఏర్పాట్లు చేసుకున్నారు. ఇందుకోసం మనోహరాబాద్ వద్ద 14 గుంటల భూమిలో ప్రయోగశాల, యంత్రాలతో కూడిన 6 వేల చదరపు అడుగుల విస్తీర్ణంతో గోదాము నిర్మాణం చేసుకున్నారు. ఇందులో పసుపు ఉడకబెట్టే, పాలిష్ చేసే, గ్రేడింగ్ చేసే, పసుపు పౌడర్ తయారు చేసే, పసుపు ప్యాకింగ్ చేసే, పసుపు ఆకుతో ఆయిల్ తీసే యంత్రాలను ఏర్పాటు చేసుకున్నారు. వీటితోపాటు కలిగోట్, జక్రాన్‌పల్లి గ్రామాల్లో పసుపు ఆకుతో ఆయిల్ తీసే మరో రెండు యంత్రాలను ఏర్పాటు చేసుకున్నారు. దేశవిదేశాల్లోని వివిధ మార్కెటింగ్ కంపెనీలతో ఒప్పందాలు చేసుకుని అందుకు అనుగుణంగా ఉత్పత్తులు అందించేందుకు రంగం సిద్ధం చేసుకున్నారు. పసుపు ఆయిల్ విషయానికి వస్తే ఫార్మా కంపెనీలకు, ఫ్లోర్లు, టాయిలెట్లు శుభ్రం చేసే రెండురకాల ఉత్పత్తులు తయారు చేయనున్నారు. మరోవైపు లెమన్ గ్రాస్, అల్లం ఆకులు, జెరినియం గడ్డి, ఫ్లవర్స్‌తో ఆయిల్ తీసేవిధంగా కూడా యంత్రాలకు తగిన మార్పులు చేసుకున్నారు. ప్రస్తుతం పసుపు పంటతో కార్యకలాపాలు మొదలుపెడుతున్నప్పటికీ భవిష్యత్తులో మరికొన్ని పంటలను సైతం ఎఫ్‌పీవో నుంచి అదనపు విలువ జోడించి ఎగుమతులు చేసేందుకు ప్రణాళికలు తయారు చేసుకుంటున్నారు. కాగా వచ్చే డిసెంబర్ నుంచి పసుపు పంట ఉత్పత్తులు అందించనున్నారు. ఏడాదిలో రూ.100 కోట్లు, వచ్చే ఐదేళ్లలో రూ.500 కోట్ల టర్నోవర్ లక్ష్యంగా పెట్టుకున్నట్లు ఎఫ్‌పీవో సభ్యులైన రైతులు తెలిపారు.





జేఎంకేపీఎం ఎఫ్‌పీవో గ్రూపు సభ్యులు

సహ్యాద్రి, ఉలవన్ ఎఫ్‌పీవోల స్ఫూర్తితో..

మహారాష్ట్రలోని నాసిక్‌లో సహ్యాద్రి రైతు ఉత్పత్తిదారుల సంఘం సోయా, శనగలు, కందులు పండించి అంతర్జాతీయ స్థాయిలో వ్యాపారం చేస్తోంది. కంపెనీ చట్టం కింద ఏర్పాటైన ఈ ఎఫ్‌పీవో ఆసియాలోనే పెద్దదిగా ఉంది. ఏటా రూ.15 వేల కోట్ల టర్నోవర్ చేస్తోంది. ఈ ఎఫ్‌పీవో సొంతంగా విమానం సైతం కొనుగోలు చేయడం గమనార్హం. ఇక తమిళనాడులోని ఈరోడ్‌లోని ఉలవన్ గ్రూపు కూరగాయల పంటల ద్వారా ఏటా రూ.10 వేల కోట్ల టర్నోవర్ చేస్తోంది. ఈ రెండు ఎఫ్‌పీవోల స్ఫూర్తితో తెలంగాణలోనే మొదటిసారిగా జేఎంకేపీఎం ఎఫ్‌పీవోను ఏర్పాటు చేసుకున్నారు.

కష్టం దళారుల పాలు కాకుండా..



రైతులు కష్టపడి పండించిన పంటల లాభం దళారులపాలు కాకుండా చేసేందుకు గాను కేంద్ర ప్రభుత్వం ఆత్మనిర్భర్ కింద ఎఫ్‌పీవోల కోసం రూ.22 వేల కోట్లు కేటాయించింది. రూ.100 కోట్ల యంత్రాల వరకు బ్యాంకు గ్యారంటీ లేకుండా ప్రభుత్వమే ష్యూరిటీతో టర్మ్ లోన్లు ఇస్తోంది. టర్మరిక్ క్లస్టర్ ద్వారా రూ.3 కోట్లతో మా ఎఫ్‌పీవో గ్రూపు ప్రాజెక్టు చేపట్టాం. స్ఫూర్తి స్కీం ద్వారా ప్రకృతి ఎన్‌జీవో సహకారంతో ముందుకెళుతున్నాం. మా ఎఫ్‌పీవో గ్రూపు కంపెనీ చట్టం ద్వారా నమోదు కావడంతో ప్రతి గ్రామం నుంచి ఇద్దరు చొప్పున మొత్తం 10 మంది డైరెక్టర్లు ఉండనున్నారు.

– పొట్కూరి తిరుపతిరెడ్డి, ఎఫ్‌పీవో బాధ్యుడు

దివికేగిన అక్షర శిల్పి!



అయాచితం నటేశ్వరశర్మ (ఫైల్)

- ప్రముఖ కవి అయాచితం నటేశ్వరశర్మ అస్తమయం
- అష్టావధానిగా, సంస్కృతాంధ్ర పండితుడిగా గుర్తింపు
- ప్రాచ్య కళాశాల ద్వారా ఎందరినో తీర్చిదిద్దిన గురువు
- సాహితీ రంగానికి తీరని లోటన్న అభిమానులు

సాక్షి ప్రతినిధి, కామారెడ్డి: ''బ్రహ్మదేవుడు ఇచ్చిన చేతులతో బ్రహ్మాండంగా రాయకుండా యంత్రాల రాతలెందుకు? నియంత్రణల తల రాతలెందుకు? చేతిరాతల అందం భూతలంలో ఏ రాతకూ లేదు.. రాస్తుంటేనే అందం'' అంటూ చేతిరాత ఔన్నత్యాన్ని 'బ్రహ్మ ఇచ్చిన రాతలు' కవితలో వివరించిన అక్షర శిల్పి, ప్రముఖ కవి, రచయిత, అష్టావధాని, దాశరథి పురస్కార గ్రహీత డాక్టర్ అయాచితం నటేశ్వర శర్మ మంగళవారం అనారోగ్యంతో హైదరాబాద్‌లో తుదిశ్వాస విడిచారు. ''అక్షరాలు నర్తిస్తాయి అంతరంగ వేదికపై.. అచ్చుల లాస్యాలూ హల్లుల తాండవాలూ ఉల్లమంతా నిండిపోతాయి.. ఆహా అని ఆనందించేంతలోనే మెరుపు తీగలవలె మాయమౌతాయి'' అన్న నటేశ్వరశర్మ సాహితీ అభిమానులను శోక సంద్రంలో ముంచుతూ దివికేగారు. ఆయనకు భార్య అరుణకుమారి, ముగ్గురు కూతుళ్లు కౌముది, జాహ్నవి, యామిని ఉన్నారు.

సాహితీ సేవ..

సంస్కృత ఆచార్యులుగా అందరికీ సుపరిచితులైన నటేశ్వరశర్మ.. అవధానిగానూ గుర్తింపు పొందారు. అవధాని శశాంక, శతావధాని సమ్మన్నగారి లక్ష్మీనరసింహశర్మ అవధానాలతో స్ఫూర్తిపొందిన ఆయన.. డాక్టర్ రంగనాథ వాచస్పతితో కలిసి జంట అవధానాలు చేశారు. ఇటీవల ఆయన రూపొందించిన సంస్కృత సంగీత రూపకం 'నాగిని' పేరుతో హైదరాబాద్ ఆకాశవాణిలో ప్రసారమైంది. విద్యార్థి దశలో రాసిన వచన కవితా సంపుటి 'విక్రాంతిగీతి' దాశరథి ప్రశంసలు అందుకుంది.

నటేశ్వరశర్మ తొలి గేయ సంపుటి వసంతకు మారి 1981లో వచ్చింది. ఖండకావ్యాలలో సమయ విలాసిని, పంచశరీయం, సౌదామినీ విలాసం, చుక్కలు, చైత్రరథం, ఆటవెలది, జీవనయానం విశిష్ట రచనలుగా కీర్తి పొందాయి. వ్యావహారిక భాషలో రాసిన కవితాశతకం.. శ్రీశ్రీ రచన సిరిసిరి మువ్వను తలపిస్తుంది. సంస్కృతాంధ్ర భాషల్లో 50కి పైగా రచనలు చేశారు.

దస్తూరి 'అయాచిత' వరం

అక్షరాలను పోతపోసినట్లుగా అయాచితం చేతి రాత ఉండేది. స్వదస్తూరితో 35 పేజీల పుస్తకాన్ని ముద్రించారు. కవర్ పేజీపై పేరుతో సహా అన్నీ ఆయన చేతి రాతతోనే ఉండడం విశేషం.

వరించిన పురస్కారాలెన్నో..

నటేశ్వరశర్మ రచించిన అభిజ్ఞాన శాకుంతలానికి తెలుగు విశ్వవిద్యాలయం నుంచి ఉత్తమ కావ్య పురస్కారం లభించింది. దేశభక్తి కవితా సంపుటి భారతీ ప్రశస్తికి జాతీయ సాహిత్య పరిషత్తు, రుతువుల సోయగాలను వర్ణిస్తూ రచించిన రుతుగీతకు ఉత్తమ కావ్య పురస్కారాలు దక్కాయి. తెలంగాణ వైభవాన్ని ప్రస్తుతిస్తూ సంస్కృతంలో రాసిన తెలంగాణ సుప్రభాతం తెలంగాణ మాస పత్రికలో ధారావాహికగా ప్రచురితమై పాఠకులను ఆకట్టుకుంది. తెలంగాణ 33 జిల్లాల ప్రత్యేకతలను తెలుపుతూ రాసిన పద్యాలు ఈ నేల విశిష్టతను చాటాయి. ఆయన అవధాన ప్రతిభకు తెలుగు విశ్వవిద్యాలయం ప్రతిభా పురస్కారం లభించింది. ఆది శంకరాచార్యులు రచించిన సౌందర్యలహరిపై పరిశోధనలకుగాను 1994లో ఉస్మానియా విశ్వ విద్యాలయం నుంచి డాక్టరేట్, స్వర్ణ పతకాన్ని అందుకున్నారు. ఆముక్తమాల్యదపై ఆయన రాసి న విమర్శనా గ్రంథం ప్రామాణికమైంది. రాష్ట్ర ప్రభుత్వం గతేడాది దాశరథి పురస్కారంతో గౌరవించింది.



నటేశ్వరశర్మ కలం నుంచి వెలువడిన పుస్తకాలు

వందలాది మందిని తీర్చిదిద్ది..

అయాచితం నటేశ్వర శర్మ 1956 జూలై 17న రామారెడ్డి మండల కేంద్రంలోని సంప్రదాయ కుటుంబంలో జన్మించారు. 1970లో కంచి కామకోటి పీఠాధిపతి జయేంద్ర సరస్వతి స్వామి తిరుమల శ్రీ వేంకటేశ్వర వేద సంస్కృత పాఠశాలను సందర్శించిన సమయంలో విద్యార్థిగా ఉన్న నటేశ్వరశర్మ సంస్కృత శ్లోకాలతో స్వాగతం పలకడంతో ఆయన ఆశ్చర్యపోయారు. మంచి కవిగా ఎదుగుతావని ఆశీర్వదించారు. నటేశ్వరశర్మ తిరుపతి వేంకటేశ్వర సంస్కృత విశ్వవిద్యాలయంలో భాషా ప్రవీణ, ఉస్మానియా విశ్వవిద్యాలయంలో ఎంఏ, ఎంఫిల్, పీహెచ్‌డీ చేశారు. 1977 లో కామారెడ్డి ప్రాచ్య కళాశాలలో సంస్కృత విభాగం ఆచార్యులుగా చేరారు. కామారెడ్డి ప్రాచ్య కళాశాలలో ఆచార్యులుగా, ప్రధాన ఆచార్యులుగా సుదీర్ఘకాలం పనిచేశారు. 2011 నుంచి 2013 వరకు ఉస్మానియా విశ్వవిద్యాలయంలోని ప్రాచ్య భాషా విభాగానికి పీఠాధిపతిగా (డీన్)గా కూడా సేవలందించారు. 2014 జూలైలో ఉద్యోగ విరమణ పొందారు. కామారెడ్డి, నిజామాబాద్, సిరిసిల్ల, సిద్దిపేట, మెదక్ తదితర జిల్లాల్లో ఆయన శిష్యులున్నారు. ఆయన శిష్యులు వందలాది మంది తెలుగు పండితులుగా ఉద్యోగాలు పొందారు.

సిద్ధాంతం, కార్యకర్తలే బీజేపీకి బలం

- లక్ష్యానికి మించి సభ్యత్వ నమోదు చేపట్టాలి
- చేవెళ్ల ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి
- బీజేపీ సభ్యత్వ నమోదు ప్రారంభం

సుభాష్‌నగర్: దేశంలో ఏ రాజకీయ పార్టీకి సిద్ధాంతం లేదని.. బీజేపీకి సిద్ధాంతం, కార్యకర్తలే బలమని చేవెళ్ల ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి అన్నారు. మంగళవారం నగరంలోని ఓ హోటల్‌లో మంగళవారం నిర్వహించిన పార్టీ సభ్యత్వ నమోదు ప్రారంభోత్సవ కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. సభ్యత్వ నమోదుకు సంబంధించిన ఫోన్ నంబర్‌తో ఉన్న వాల్ పోస్టర్లను ప్రదర్శించారు. అనంతరం కొండా విశ్వేశ్వర్‌రెడ్డి మాట్లాడుతూ.. కాంగ్రెస్‌కు, కమ్యూనిస్టు పార్టీలకు సిద్ధాంతం లేదని, బీజేపీ హిందుత్వ, జాతీయవాదం అనే సిద్ధాంతంతో ముందుకెళ్తోందన్నారు. మోదీ నాయకత్వంలో దేశం అన్ని రంగాల్లో ముందంజలో ఉందని, రానున్నరోజుల్లో ప్రపంచంలోనే మొదటిస్థానానికి చేరుకుంటుందని ధీమా వ్యక్తంచేశారు. పేద ముస్లిముల ప్రయోజనాల కోసమే వక్ఫ్‌బోర్డు బిల్లును రద్దు చేస్తుందని, వక్ఫ్‌బోర్డు సుప్రీంకోర్టు కంటే ఎక్కువ అధికారాలు కలిగి ఉందన్నారు. కాంగ్రెస్‌తోపాటు ఇతర ప్రాంతీయ పార్టీలు రాజకీయ అవసరాల కోసం సందర్భాన్ని బట్టి హామీలిస్తూ విస్మరిస్తాయని ఎద్దేవా చేశారు. సెప్టెంబర్ 17 వరకు సభ్యత్వ నమోదు లక్ష్యాన్ని చేరుకునేలా జిల్లాశాఖతో సమన్వయం చేసుకోవాలని తెలిపారు. జిల్లాలో 2లక్షల లక్ష్యానికి మించి సభ్యత్వ నమోదు చేస్తారని ఆయన ఆకాంక్షించారు. ఇప్పటికే తెలంగాణలో జిల్లా 30వేల సభ్యత్వంతో నంబర్‌వన్ స్థానంలో ఉందని కితాబిచ్చారు. సభ్యత్వ నమోదు చేపడితేనే రాబోయే స్థానిక ఎన్నికల్లో సత్తా చాటవచ్చని తెలిపారు. నిజామాబాద్ అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ మాట్లాడుతూ.. కాంగ్రెస్, బీఆర్ఎస్ కుటుంబ పార్టీలని, వాటిని ప్రజలు తిరస్కరిస్తున్నారన్నారు. 2028లో రాష్ట్రంలో బీజేపీ అధికారంలోకి రావడం ఖాయమన్నారు. ఆర్మూర్ ఎమ్మెల్యే పైడి రాకేశ్‌రెడ్డి మాట్లాడుతూ.. వక్ఫ్‌బోర్డు చట్టాలపై అసత్యప్రచారం చేస్తున్నారని, దేశంలో అల్లర్లకు కుట్రలు జరుగుతున్నాయని, మనమంతా సిద్ధంగా ఉండాలని అన్నారు. జిల్లాలోని వైద్యులు, మేధావులు, అడ్వొకేట్లు, వ్యాపారవేత్తలు, మహిళలు పెద్దసంఖ్యలో తరలివచ్చి స్వచ్ఛందంగా సభ్యత్వం తీసుకున్నారు. మొదటి సభ్యత్వాన్ని దినేశ్ కులాచారికి కొండా విశ్వేశ్వర్‌రెడ్డి అందజేశారు. సీనియర్ నాయకులు లోక భూపతిరెడ్డి, బద్దం లింగారెడ్డి, సభ్యత్వ నమోదు కన్వీనర్ పుప్పాల శివరాజ్, నాయకులు స్రవంతిరెడ్డి, స్వామియాదవ్, పోతన్‌కర్ లక్ష్మీనారాయణ, న్యాలం రాజు, కంచెట్టి గంగాధర్, బీఆర్ శివప్రసాద్, మోర్చాల ప్రతినిధులు, అసెంబ్లీ కన్వీనర్లు, మండలాల అధ్యక్షులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



సభ్యత్వ నమోదు వాల్‌పోస్టర్‌ను విడుదల చేస్తున్న కొండా విశ్వేశ్వర్‌రెడ్డి

సమస్యాత్మక ప్రాంతాలపై దృష్టి సారించాలి

- వినాయక నిమజ్జన ఏర్పాట్లపై ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి సమీక్ష
- బాసర, ఉమ్మెడ బ్రిడ్జీల పరిశీలన



సమీక్ష సమావేశంలో మాట్లాడుతున్న బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి

ఖలీల్‌వాడి: వినాయక నిమజ్జనం సందర్భంగా సమస్యాత్మక ప్రాంతాలపై దృష్టి సారించాలని ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి పోలీసు యంత్రాంగానికి సూచించారు. పోలీస్ కమిషనరేట్ కార్యాలయంలో మంగళవారం నిర్వహించిన సమీక్ష సమావేశంలో కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతు, ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి, సీపీ కల్మేశ్వర్ మాట్లాడారు. గణేశ్ నిమజ్జనం సమయంలో వదంతులు వ్యాపిస్తే నమ్మొద్దని, పరస్పర సహకారంతో గణేశ్ ఉత్సవాలు, మిలాద్–ఉన్– నబీ వేడుకలను ప్రశాంత వాతావరణంలో నిర్వహించుకోవాలని సూచించారు. వేడుకల్లో అల్లర్లు సృష్టించేందుకు, శాంతి భద్రతలకు విఘాతం కలిగించేందుకు ప్రయత్నించే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని ఎ మ్మెల్యే సుదర్శన్‌రెడ్డి సూచించారు. గట్టి బందోబస్తు ఏర్పాటు చేస్తున్నామని, శోభాయాత్ర కొనసాగే మార్గాల్లో సీసీ కెమెరా నిఘా ఉంటుందని సీపీ కల్మేశ్వర్ తెలిపారు. ట్రాఫిక్ ఇబ్బందులు తలెత్తకుండా ప్రణాళికాబద్ధంగా చర్యలు తీసుకుంటామన్నారు. సమావేశంలో ఉర్దూ అకాడమీ చైర్మన్ తాహెర్ బిన్ హందాన్, నగర పాలక సంస్థ కమిషనర్ ఎం మకరంద్, బోధన్ సబ్ కలెక్టర్ వికాస్ మహతో, అదనపు డీసీపీ కోటేశ్వర్‌రావు, మున్సిపల్, ఆర్‌అండ్‌బీ, అగ్నిమాపక, ఫిషరీస్, పంచాయతీరాజ్ తదితర శాఖల అధికారులు పాల్గొన్నారు.

శోభాయాత్ర మార్గం, నిమజ్జన ప్రాంతాల పరిశీలన

ఖలీల్‌వాడి/నవీపేట్: వినాయక శోభాయాత్ర ప్రారంభం కానున్న జిల్లా కేంద్రంలోని దుబ్బ ప్రాంతం నుంచి యంచ శివారులోని గోదావరి బ్రిడ్జి వరకు మార్గాన్ని కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతు, సీపీ కల్మేశ్వర్ పరిశీలించారు. యుద్ధప్రాతిపదికన రోడ్ల మరమ్మతులు చేపట్టాలని పంచాయతీరాజ్, ఆర్ అండ్ బీ అధికారులను కలెక్టర్ ఆదేశించారు. రోడ్లకు ఇరువైపులా అడ్డంగా ఉన్న చెట్ల కొమ్మలను తొలగించాలని, తక్కువ ఎత్తులో ఉన్న విద్యుత్ తీగలను పైకి బిగించాలని సూచించారు. జానకంపేట్ రైల్వే క్రాసింగ్ మీదుగా ఎనిమిది అడుగులకు పైబడి ఎత్తున్న విగ్రహాలను తరలించే వీలు లేకపోవడంతో ప్రత్యామ్నాయ మార్గంగా నందిపేట మండలంలోని ఉమ్మెడ గోదావరి పరీవాహక ప్రాంతాన్ని పరిశీలించారు. భారీ విగ్రహాల నిమజ్జనం కోసం క్రేన్లను అందుబాటులో ఉంచాలని, తగిన లైటింగ్ వ్యవస్థను ఏర్పాటు చేసుకోవాలని, గజ ఈతగాళ్లను సిద్ధంగా ఉంచాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. వారి వెంట ఆర్డీవో రాజేంద్రకుమార్, నార్త్ రూరల్ సీఐ సతీశ్, స్థానిక అధికారులున్నారు.



యంచ గోదావరి బ్రిడ్జిని పరిశీలిస్తున్న కలెక్టర్ హనుమంతు, సీపీ కల్మేశ్వర్

జిల్లా వ్యవసాయాధికారితో 'సాక్షి' ఫోన్ ఇన్

వరుస వర్షాలు, వరదల కారణంగా ఉద్యాన, వ్యవసాయ పంటలను కాపాడుకోవడానికి తీసుకోవాల్సిన జాగ్రత్తలు, సస్యరక్షణ చర్యలపై రైతులు ప్రశ్నలు అడగవచ్చు.



జిల్లా వ్యవసాయాధికారి వాజిద్ హుస్సేన్

తేది : 12-10-2024 (గురువారం)

సమయం: ఉదయం 11.00 నుంచి 12.00 గంటల వరకు..

ఫోన్ చేయాల్సిన నంబర్: 72888 94567, 99594 12852

క్లుప్తంగా

వీహెచ్‌పీఎస్‌ జాతీయ నేతకు పితృ వియోగం



బోధన్‌: మండలంలోని బెల్లాల్‌కు చెందిన వికలాంగుల హక్కుల పోరాట సమితి జాతీయ అధ్యక్షురాలు సుజాతసూర్యవంశీ తండ్రి శ్యాంరావు (90) మంగళవారం అనారోగ్యంతో కన్నుమూశారు. స్వగ్రామంలో నిర్వహించిన అంత్యక్రియలకు ఎమ్మార్పీఎస్‌, వీహెచ్‌పీఎస్‌ వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ హాజరై పాడె మోశారు. అంత్యక్రియల్లో నాయకులు మానికోళ్ల గంగాధర్‌, కనక ప్రమోద్‌మాదిగ, భూమయ్య మాదిగ, ప్రవీణ్‌, పద్మ, సావిత్రి, తాడెం అబ్బయ్య, గందమాల చంద్రయ్య, జాదవ్‌, ఫకీర్‌ నాయక్‌, స్వప్న, రమేశ్‌, బంధువులు తదితరులు పాల్గొన్నారు.

ప్లాస్టిక్‌ వాడితే జరిమానా



ఆర్మూర్‌టౌన్‌: పర్యావరణాన్ని కాలుష్యం చేసే ప్లాస్టిక్‌ కవర్లను ఎవరైనా వాడితే వారికి జరిమానా విధిస్తామని సానిటరీ ఎస్సై గజానంద్‌ పేర్కొన్నారు. ఆర్మూర్‌ పట్టణంతో పాటు పెర్కిట్‌, మామిడిపల్లిలో మున్సిపల్‌ శబూఖ అధికారులు పలు దుకాణాలను తనిఖీ చేశారు. ప్లాస్టిక్‌ వాడుతున్న దుకాణదారులకు జరిమానా విధించారు. ఎవరైనా ప్లాస్టిక్‌ కవర్లు వాడితే వారిపై తగు చర్యలు తప్పవని హెచ్చరించారు. తనిఖీల్లో పర్యావరణ ఇంజినీర్‌ పూర్ణమౌళి, సిబ్బంది ప్రశాంత్‌, అక్షయ్‌, రాము, నర్సయ్య తదితరులు పాల్గొన్నారు.

కష్టాలను తట్టుకొని నిలబడాలి



నిజామాబాద్‌నాగారం: కష్టాలను తట్టుకొని నిలబడితేనే జీవితానికి పరమార్థం ఉంటుందని ప్రభుత్వ మెడికల్‌ కళాశాల ప్రిన్సిపాల్‌ డాక్టర్‌ శివప్రసాద్‌ అన్నారు. ప్రపంచ ఆత్మహత్యల నివారణ దినోత్సవం సందర్భంగా నిజామాబాద్‌ ప్రభుత్వ వైద్య కళాశాల, జిల్లా వైద్య శాఖ ఆధ్వర్యంలో మంగళవారం ఆరోగ్య అవగాహన కార్యక్రమాన్ని ప్రభుత్వ వైద్య కళాశాలలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జీవితంలో ఎన్ని ఆటంకాలు, అవరోధాలు ఎదురైన ఆత్మహత్యలు చేసుకోవద్దని, ధైర్యంగా వాటిని ఎదుర్కోవాలన్నారు. అనంతరం కార్యక్రమానికి సంబంధించిన పోస్టర్లను ఆవిష్కరించారు. కార్యక్రమంలో నార్కోటిక్స్‌ బ్యూరో డీఎస్పీ సోమనాథం, సైకియాట్రి అసిస్టెంట్‌ ప్రొఫెసర్‌ రాజేందర్‌ నూరి వీడు,జిల్లా సైకియాట్రిస్ట్‌ రవితేజ, వైద్య, నర్సింగ్‌ విద్యార్థులు, అధ్యాపకులు పాల్గొన్నారు.

నటేశ్వరశర్మ మృతికి పలువురి సంతాపం



నటేశ్వరశర్మ(ఫైల్‌)

నిజామాబాద్‌ రూరల్‌: సుప్రసిద్ధ కవి, తెలుగు, సంస్కృత భాషా పండితుడు డాక్టర్‌ అయాచితం నటేశ్వరశర్మ అనారోగ్యంతో మంగళవారం హైదరాబాద్‌లోని ఆయన స్వగృహంలో మృతి చెందారు. ఆయన సౌందర్య లహరి సౌందర్యం అంశంగా పరిశోధన చేసి డాక్టరేట్‌ పొందారు. 50కి పైగా పద్య, వచన కవితా పుస్తకాలు, వ్యాసాలు ముద్రించారు. ఇటీవల రాష్ట్ర ప్రభుత్వంచే దాశరథి పురస్కారం అందుకున్నారు. వృత్తిరీత్యా ఆయన కామారెడ్డి ప్రాచ్య కళాశాలలో ప్రధానాచార్యులుగా సేవలందించి పదవీవిరమణ పొందారు. ఆయన మృతికి పలు సాహితీ సాంస్కృతిక సంస్థలు, కవులు కాసర్ల నరేశ్‌ రావు, వీపీ చందన్‌ రావు, కందాళై రాఘవాచార్య, గంట్యాడ ప్రసాద్‌, శారదా హన్మాండ్లు సంతాపం తెలిపారు.

ఎన్‌సీసీతో ఉజ్వల భవిష్యత్తు

- శిక్షణ ఇవ్వడానికి నిధులు తప్పనిసరి
- కేంద్ర సహకారం ఫుల్‌.. రాష్ట్రం నుంచి నిల్‌
- ఎన్‌సీసీ తెలంగాణ, ఆంధ్ర డిప్యూటీ డైరెక్టర్‌ జనరల్‌ ఎయిర్‌ కమాండర్‌ వీఎమ్‌ రెడ్డి



మాట్లాడుతున్న కమాండర్‌ వీఎమ్‌ రెడ్డి



గౌరవ వందనం స్వీకరిస్తున్న కమాండర్‌

నిజామాబాద్‌నాగారం: ఎన్‌సీసీ ద్వారా విద్యార్థులకు ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని ఎన్‌సీసీ తెలంగాణ, ఆంధ్ర డిప్యూటీ డైరెక్టర్‌ జనరల్‌ ఎయిర్‌ కమాండర్‌ వీఎమ్‌ రెడ్డి(మధుసూదన్‌రెడ్డి) అన్నారు. జిల్లా కేంద్రంలోని గంగాస్థాన్‌లో ఉన్న ఎన్‌సీసీ 12వ బెటాలియన్‌ కార్యాలయాన్ని ఆయన మంగళవారం పరిశీలించారు. ముందుగా ఎన్‌సీసీ క్యాడెట్ల నుంచి గౌరవ వందనం స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నిజామాబాద్‌ ఎన్‌సీసీ యూనిట్‌ పరిధిలోని 45 కళాశాలలు, పాఠశాలల్లో సుమారు మూడు వేల మందికి శిక్షణ కొనసాగుతోందన్నారు. క్యాడెట్లకు క్యాంపులు నిర్వహించడానికి ఖర్చుతో కూడుకున్న విషయమన్నారు. కేంద్రం నుంచి 75శాతం నిధులు వస్తే, రాష్ట్రం నుంచి 25శాతం నిధులు కేటాయించాల్సి ఉంటుందన్నారు. అయితే కేంద్రం నిధులు ఇస్తున్నా, రాష్ట్రం 2022, 2023 సంవత్సరాల్లో రావాల్సిన నిధులు ఇంకా విడుదల కాలేదన్నారు. దీంతో ఆయా పాఠశాలల్లో ఉండే ఎన్‌సీసీ ఆఫీసర్లు సొంత ఖర్చులతో క్యాడెట్లకు అవసరమైన పరికరాలు ఇతర ఖర్చులను భరించి శిక్షణ ఇస్తున్నారని పేర్కొన్నారు. తలాసైనిక్‌, నేవీ, ఢిల్లీ తదితర క్యాంపులకు క్యాడెట్లను పంపడానికి క్యాడెట్లకు నూతన డ్రెస్‌ ఉంటుందని, వీటిని సైతం ఆఫీసర్లు సొంత డబ్బులు పెట్టి పంపిస్తున్నారన్నారు. జిల్లాకు రూ. 8లక్షల వరకు బకాయిలు ఉన్నాయని, రాష్ట్ర వ్యాప్తంగా రూ. 3కోట్ల వరకు నిధులు రావాల్సి ఉందన్నారు. సరైనా సమయంలో నిధులు లేకపోవడంతో ఇబ్బందులు ఏర్పడుతున్నాయన్నారు. అయినా శిక్షణలో ఇబ్బందులు రాకుండా అన్ని విధాలుగా చర్యలు తీసుకుంటున్నామని అన్నారు.

ఉద్యోగాలకు కేరాఫ్‌ ఎన్‌సీసీ

ఎన్‌సీసీలో ఉండే ప్రతి కెడెట్‌కు ఏ, బీ, సీ సర్టిఫికెట్లు ఉండాలని, అప్పుడే విద్యా, ఉద్యోగాల్లో సీ సర్టిఫికేట్‌తో ఉద్యోగాలు లభిస్తాయన్నారు. నీట్‌ రాస్తే ఎన్‌సీసీ సీ సర్టిఫికెట్‌తో మార్కుల వెయిటేజీ ఉంటుందన్నారు. అగ్నివీర్‌, ఆర్మీ, నేవీ, స్పోర్ట్స్‌ కోటాలో సైతం ఉద్యోగాలకు అవకాశం ఉంటుందన్నారు. కొత్తగా సైబర్‌ క్రైం శిక్షణ ఎన్‌సీసీ క్యాడెట్లకు శిక్షణలో ఇస్తున్నారని పేర్కొన్నారు.

అవగాహన లేక ఇబ్బందులు

జిల్లా, రాష్ట్రస్థాయిలో అధికారులకు ఎన్‌సీసీపై కచ్చితమైన అవగాహన లేదని ఎన్‌సీసీకి నిధుల సమస్య వస్తుందని అన్నారు. ఆంధ్రప్రదేశ్‌లో అధికారులకు ఎన్‌సీసీపై ముందు అవగాహన ఉండేది కాదని తాము ఎన్‌సీసీపై చేస్తున్న ప్రజెంటేషన్‌తో నిధులు విడుదలవుతున్నాయని అన్నారు. కొన్నేళ్లుగా ఏపీలో ఎన్‌సీసీకి పెద్ద పీట వేస్తున్నారన్నారని పేర్కొన్నారు.

ఎన్‌సీసీని విభజిస్తేనే..

ఎన్‌సీసీ గత పదేళ్లుగా ఉమ్మడి రాష్ట్రంగానే కొనసాగుతోందని అన్నారు. దీంతో ఢిల్లీలో నిర్వహించే తలాసైనిక్‌, ఫరేడ్‌ తదితర క్యాంపులకు రెండు రాష్ట్రాల నుంచి 125మంది క్యాడెట్లను పంపించడం జరుగుతోందన్నారు. అదే రెండు రాష్ట్రాలుగా ఎన్‌సీసీని విభజిస్తే చెరో 125మంది అంటే 250మంది క్యాడెట్లకు జాతీయ క్యాంపులు, ఢిల్లీ క్యాంపులకు వెళ్లేందుకు అవకాశం ఉంటుందన్నారు. ఇలా అన్ని రకాలుగా ఎంతో ఉపయోగపడుతుందన్నారు. అనంతరం విజయ్‌స్కూల్‌లో ఎన్‌సీసీ శిక్షణ శిబిరాన్ని పరిశీలించారు. కార్యక్రమంలో ఎన్‌సీసీ గ్రూపు కమాండర్‌ కల్నల్‌ సునీల్‌ అబ్రహం, అడ్మినిస్ట్రేటివ్‌ ఆఫీసర్‌ లెఫ్టినెంట్‌ కల్నల్‌ తొంగె పాటిల్‌కేడీ, ట్రెయినింగ్‌ ఆఫీసర్‌ లెఫ్టినెంట్‌ కల్నల్‌ కౌస్తవ్‌ మహంతి, 12 బెటాలియన్‌ కమాండింగ్‌ ఆఫీసర్‌ లెఫ్టినెంట్‌ కల్నల్‌ విష్ణు పి నాయర్‌, ఎన్‌సీసీ ఆఫీసర్లు, క్యాడెట్లు తదితరులు పాల్గొన్నారు.

చదువుతోపాటు క్రీడలూ ముఖ్యమే

- బాల్కొండ ఎమ్మెల్యే ప్రశాంత్‌రెడ్డి



దయానంద్‌రెడ్డిని సన్మానిస్తున్న ఎమ్మెల్యే

బాల్కొండ: చదువుతోపాటు విద్యార్థులకు క్రీడలూ ముఖ్యమే అని బాల్కొండ ఎమ్మెల్యే ప్రశాంత్‌రెడ్డి అన్నారు. మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఆవరణలో నిర్వహిస్తున్న ఉమ్మడి బాల్కొండ మండల స్థాయి అంతర్‌ పాఠశాలల క్రీడలను జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. క్రీడలతో మనోస్థైర్యం పెరుగుతుందని అన్నారు. క్రీడాకారులు గెలుపోటములను సమానంగా తీసుకోవాలన్నారు. క్రీడాకారుల అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తున్న ఏనుగు దయానంద్‌రెడ్డిని సన్మానించి అభినందించారు. టోర్నీలో 30 పాఠశాలల విద్యార్థులు పాల్గొంటున్నట్లు నిర్వాహకులు పేర్కొన్నారు. మూడు రోజుల పాటు టోర్నీ జరుగుతుందన్నారు. ఎంఈవో రాజేశ్వర్‌, మాజీ ప్రజాప్రతినిధులు, పీడీ రాజుకుమార్‌, మల్లేశ్‌, పీఈటీలు పాల్గొన్నారు.

మాంసం దుకాణదారులకు నోటీసులు



నందిపేట్‌: మండల కేంద్రంలోని మాంసం విక్రయదారులకు గ్రామపంచాయతీ ఆధ్వర్యంలో మంగళవారం నోటీసులు జారీ చేశారు. కుక్కల సంతతి ఎక్కువ కావడానికి మండల కేంద్రంలోని మాంసం దుకాణాలు తమ వ్యర్థాలను గ్రామ శివారుల్లో విచ్చలవిడిగా పారేయడంతో కుక్కల సంఖ్య పెరుగుతోందని ఫిర్యాదులు రావడంతో నోటీసులు జారీ చేశారు. నందిపేట పంచాయతీ కార్యదర్శి నవీన్‌ కుమార్‌ ప్రతి దుకాణానికి వెళ్లి తమ తమ వ్యర్థాలను డంప్‌ యార్డులో వేయాలని లేకుంటే జరిమానాలతో షాపులను సీజ్‌ చేస్తామని హెచ్చరించారు. ఆయన వెంట జీపీ సిబ్బంది ఉన్నారు.

ఛత్తీస్‌గఢ్‌ పోలీసుల అదుపులో మొబైల్‌ షాపు యజమాని

ఖలీల్‌వాడి: నగరంలోని ఒకటో టౌన్‌ పీఎస్‌ పరిధిలో ఛత్తీస్‌గఢ్‌ పోలీసులు ఓ మొబైల్‌ షాపు యజమానిని అదుపులోకి తీసుకున్న ఘటన జిల్లాలో కలకలం రేపింది. మంగళవారం నగరంలోని ఓ మొబైల్‌ షాప్‌ ఓనర్‌ను అదుపులోకి తీసుకోని విచారిస్తున్నారు. ఛత్తీస్‌గఢ్‌లో జరిగిన సైబర్‌ క్రైమ్‌ కేసు విచారణలో భాగంగా అదుపులోకి తీసుకున్నట్లు తెలుస్తోంది. ఓ మొబైల్‌ షాప్‌ నిర్వాహకుడి అకౌంట్‌లో వచ్చిన నగదు ఎలా వచ్చిందో వాకబు చేస్తున్నారు. ఛత్తీస్‌గఢ్‌ పోలీసులు సాయంత్రం నుంచి సోదాలు చేస్తున్నా నగర పోలీసులు బయటకు తెలియకుండా చూస్తున్నారని వినిపిస్తోంది.

క్రైం కార్నర్‌

కాలువలో పడి ఒకరి మృతి



రాజు(ఫైల్‌)

మాక్లూర్‌: ప్రమాదవశాత్తు కాలువలో పడి ఒకరు మృతి చెందిన ఘటన మండలంలోని మాదాపూర్‌లో చోటు చేసుకుంది. ఎస్సై రాజశేఖర్‌ తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన పాల్వాయి రాజు(37) డిష్‌బాయిగా పనిచేస్తున్నాడు. సోమవారం రాత్రి ఇంటి నుంచి బయటకు వెళ్లి రాజు తిరిగి రాలేదు. మంగళవారం సాయంత్రం కాలువలో మృతదేహం ఉందన్న సమాచారం మేరకు పోలీసులు ఘటన స్థలానికి చేరుకొని వివరాలు సేకరించారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

జారిపడి వృద్ధురాలు..

రుద్రూర్‌: కోటగిరి పీఎస్‌ పరిధిలోని పొతంగల్‌ మండలం సుంకినిలో సోంకాంబ్లెరాజాబాయి (63) అనే వృద్ధురాలు బాత్‌రూంలో కాలకృత్యాలు తీర్చుకునేందుకు వెళ్లగా జారిపడి మృతి చెందినట్లు ఎస్సై సందీప్‌ తెలిపారు. మృతురాలు కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతోందని అన్నారు. మృతురాలి కుమార్తె రమాబాయి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

మద్యానికి బానిసై ఒకరి ఆత్మహత్య

ఆర్మూర్‌టౌన్‌: మద్యానికి బానిసై ఒకరు ఆత్మహత్య చేసుకున్న ఘటన పట్టణంలోని యానంగుట్ట సమీపంలో చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. మహారాష్ట్రకు చెందిన బాలుప్రకాశ్‌ బొదిరె(40) నాలుగేళ్ల క్రితం బతుకుదెరువు నిమిత్తం ఆర్మూర్‌కు వచ్చి డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. కొన్నేళ్లుగా భార్య, పిల్లలకు దూరంగా ఉంటున్నాడు. తాగుడికి బానిసగా మారడంతో జీవితంపై విరక్తి చెందిన సోమవారం రాత్రి చెట్టుకు ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడి తల్లి జయబాయి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

తహసీల్దార్‌ ఎదుట బైండోవర్‌

జక్రాన్‌పల్లి: మండలంలోని మునిపల్లికి చెందిన రౌడీ షీటర్‌ నర్ర నవీన్‌ను తహసీల్దార్‌ కిరణ్మయి ఎదుట మంగళవారం బైండోవర్‌ చేసినట్లు ఎస్సై తిరుపతి తెలిపారు. ఆర్మూర్‌కు చెందిన నవీన్‌ ప్రస్తుతం మునిపల్లిలో ఉంటూ తరచూ గొడవలకు పాల్పడుతుండడంతో నవీన్‌పై రౌడీ షీటర్‌గా కేసు నమోదు చేసి తహసీల్దార్‌ ఎదుట బైండోవర్‌ చేసినట్లు పేర్కొన్నారు. నవీన్‌కు కౌన్సిలింగ్‌ ఇచ్చినట్లు ఎస్సై తెలిపారు.

తొమ్మిది మంది..

నిజాంసాగర్‌(జుక్కల్‌): అటవీ ప్రాంతంలో చెట్లను నరికి, భూకబ్జాకు యత్నిస్తున్న వారిని అదుపులోకి తీసుకొని మహమ్మద్‌నగర్‌ తహసీల్దార్‌ సవాయిసింగ్‌ ఎదుట బైండోవర్‌ చేసినట్లు బాన్సువాడ రేంజ్‌ అధికారి అబీబ్‌ మంగళవారం తెలిపారు. మహమ్మద్‌నగర్‌ మండలంలోని సింగితం అటవీ ప్రాంతంలో గాంధారి మండలం గండివేట్‌ తండాకు చెందిన 9 మంది చెట్లను నరుకుతూ, భూమిని చదును చేస్తుండగా పట్టుకున్నామన్నారు. వారిపై కేసు నమోదు చేసి బైండోవర్‌ చేశామన్నారు. భూఆక్రమణను అడ్డుకున్న బీట్‌ అధికారి స్వరూపను రేంజ్‌ అధికారి అభినందించారు.

డ్రంకన్‌ డ్రైవ్‌లో ఇద్దరికి జైలు శిక్ష

ఖలీల్‌వాడి: డ్రంకన్‌ డ్రైవ్‌లో పట్టుబడ్డ ఇద్దరికి జైలు శిక్ష విధించినట్లు ఏసీపీ నారాయణ తెలిపారు. నగరంలోని ట్రాఫిక్‌ పీఎస్‌ ఎదుట మంగళవారం నిర్వహించిన డ్రంకన్‌ డ్రైవ్‌లో బోర్గాంకు చెందిన చామకూర లక్పతి, ఆదర్శనగర్‌కు చెందిన రావుల మహేశ్‌ పట్టుబడగా వీరిని జిల్లా సెకండ్‌ క్లాస్‌ మెజిస్ట్రేట్‌ ఎదుట హాజరుపర్చినట్లు పేర్కొన్నారు. జడ్జి వీరికి రెండు రోజుల జైలు శిక్ష విధించారన్నారు. మద్యం సేవించి వాహనాలు నడపరాదని, ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్‌ ధరించాలని సూచించారు.

మహిళను కాపాడిన ఎస్సై

బాసర: ఆత్మహత్మకు యత్నించిన మహిళను ఎస్సై కాపాడి కుటుంబ సభ్యులకు అప్పగించారు. నిజామాబాద్‌ జిల్లా కేంద్రానికి చెందిన రేష్మ గోదావరినదిలో దూకి ఆత్మహత్య చేసుకునేందుకు వస్తున్నట్లు డయల్‌ 100కు సమాచారం అందింది. దీంతో నిజామాబాద్‌ జిల్లా నవీపేట, నిర్మల్‌ జిల్లా బాసర పోలీసులు అప్రమత్తమై తీవ్ర గాలింపు చర్యలు చేపట్టారు. గోదావరి నది బ్రిడ్జి వద్ద మహిళ కనిపించడంతో బాసర ఎస్సై గణేశ్‌ అప్రమత్తమై కాపాడారు. స్థానిక పీఎస్‌కు తరలించి కౌన్సెలింగ్‌ నిర్వహించి కుటుంబ సభ్యులకు అప్పగించారు.

హాజీపూర్‌లో అటవీ చెట్ల నరికివేత

- 9 మందిపై కేసు నమోదు



ఎల్లారెడ్డి: ఎల్లారెడ్డి అటవీశాఖ రేంజ్‌ పరిధిలోని హాజీపూర్‌ అటవీప్రాంతంలో సోమవారం రాత్రి సుమారు 15 ఎకరాల్లో అక్రమార్కులు చెట్లను నరికివేసినట్లు తండావాసులు తెలిపారు. అధికారుల అండదండలతోనే ఈ ప్రాంతంలో కొంతమంది చెట్లను నరికి వేస్తున్నారని ఆరోపించారు. విషయం తెలుసుకున్న ఎఫ్‌ఆర్‌వో ఓంకార్‌ చెట్లు నరికిన ప్రాంతాన్ని మంగళవారం పరిశీలించారు. అనంతరం చెట్లు నరికిన 9 మందిని అదుపులోకి తీసుకొని కేసు నమోదు చేసినట్లు ఎఫ్‌ఆర్‌వో పేర్కొన్నారు. అటవీ ప్రాంతంలో ఎవరైనా చెట్లను నరికితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

ట్రాక్టర్‌ సీజ్‌

సిరికొండ: సిరికొండ రేంజ్‌ పరిధిలోని తూంపల్లి సెక్షన్‌ గుడి లింగాపూర్‌ బీట్‌ అటవీ ప్రాంతంలో అడవిని చదును చేస్తున్న ట్రాక్టర్‌ను మంగళవారం పట్టుకొని సీజ్‌ చేసినట్లు సెక్షన్‌ అధికారి కృష్ణగీత్‌ తెలిపారు. కంపార్ట్‌మెంట్‌ నెంబర్‌ 492లో అక్రమంగా అటవీ భూమిని చదును చేస్తుండగా దాడి చేసి పట్టుకున్నామన్నారు. నిందితులపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు. బీట్‌ అధికారులు నగేశ్‌, హరీశ్‌, రాజేందర్‌, గోపాల్‌ తదితరులు పాల్గొన్నారు.

వదినను చంపిన మరిది అరెస్ట్‌



భిక్కనూరు: వదినను హత్య చేసిన మరిదిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు భిక్కనూరు సీఐ సంపత్‌, ఎస్సై సాయికుమార్‌ మంగళవారం తెలిపారు. మండలంలోని భాగిర్తిపల్లికి చెందిన మంద లావణ్య అలియాస్‌ యేసుమణిని ఆస్తి తగాదాలతో తన మరిది మంద సురేష్‌ అలియాస్‌ యాకూబ్‌ ఈ నెల 6న హత్య చేసి పరారయ్యాడు. నిందితుడిని ఉదయం పట్టుకొని అరెస్టు చేయగా జడ్జి ఆదేశాల మేరకు రిమాండ్‌కు తరలించినట్లు పేర్కొన్నారు.

రేషన్‌ బియ్యం పట్టివేత

సిరికొండ: మండలంలోని కొండాపూర్‌లో ఆటోలో అక్రమంగా తరలిస్తున్న రేషన్‌ బియ్యాన్ని మంగళవారం పట్టుకున్నట్లు ఎస్సై ఎల్‌ రామ్‌ తెలిపారు. దారావత్‌ చందు అనే వ్యక్తి తన ఆటోలో ఎలాంటి అనుమతి లేకుండా రేషన్‌ బియ్యం తరలిస్తుండగా 8 క్వింటాళ్ల బియ్యం, ఆటోను సీజ్‌ చేసి వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై పేర్కొన్నారు.

పది రోజుల్లో 105 టీఎంసీల ఇన్‌ఫ్లో

- ఎగువ నుంచి పోటెత్తిన వరద
- మంగళవారం ఉదయం గేట్లు ఎత్తిన అధికారులు..
- రాత్రి వేళ మూసివేత



గోదావరిలోకి విడుదలవుతున్న నీరు

బాల్కొండ: ఉత్తర తెలంగాణ జిల్లాల వరప్రదాయిని శ్రీరాంసాగర్‌ ప్రాజెక్ట్‌లోకి గడిచిన పది రోజుల్లో 105 టీఎంసీల వరద నీరు వచ్చి చేరింది. ఈ నెల 1 నుంచి ప్రాజెక్ట్‌లోకి ముందు 31 వేల క్యూసెక్కులతో ప్రారంభమైన ఇన్‌ఫ్లో గరిష్ఠంగా 3 లక్షల 26 వేల క్యూసెక్కులకు వరకు వచ్చింది. కనిష్ఠంగా 15 వేల క్యూసెక్కులకు పడిపోయింది. ప్రాజెక్ట్‌నీటి నిల్వ సామర్థ్యం కంటే ఎక్కువ నీరు కేవలం 10 రోజుల్లోనే వచ్చి చేరింది. ప్రాజెక్ట్‌లోకి ఇప్పటి వరకు 170 టీఎంసీల వరద నీరు వచ్చి చేరింది. ఎగువ ప్రాంతాల నుంచి ఇంకా ఇన్‌ఫ్లో వస్తూనే ఉంది.

కొనసాగుతున్న విద్యుదుత్పత్తి

ప్రాజెక్ట్‌ నుంచి కాకతీయ కాలువ, ఎస్కేప్‌ గేట్ల ద్వారా మొత్తం 8 వేల క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తుండడంతో స్థానిక జల విద్యుదుత్పత్తి కేంద్రంలో నాలుగు టర్బయిన్‌ల ద్వారా 36.35 మెగావాట్ల విద్యుదుత్పత్తి అవుతోంది. ప్రాజెక్ట్‌ నిండుకుండలా మారడంతో సామర్థ్యానికి మించి విద్యుదుత్పత్తి చేస్తున్నారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం 10.33 మిలియన్‌ యూనిట్ల విద్యుదుత్పత్తి జరిగిందని జెన్‌కో డీఈఈ శ్రీనివాస్‌ తెలిపారు.

కాలువల ద్వారా కొనసాగుతున్న నీటి విడుదల

ప్రాజెక్ట్‌ నుంచి కాలువల ద్వారా నీటి విడుదల కొనసాగుతోంది. కాకతీయ కాలువ ద్వారా 6 వేల క్యూసెక్కులు, ఎస్కేప్‌ గేట్ల ద్వారా 2 వేల క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. ఆవిరి రూపంలో 666 క్యూసెక్కుల నీరు పోతుండగా, మిషన్‌ భగీరథ అవసరాలకు 231 క్యూసెక్కుల నీటిని వినియోగిస్తున్నారు. ప్రాజెక్ట్‌ పూర్తిస్థాయి నీటి మట్టం 1091(80.5 టీఎంసీలు) అడుగులు కాగా ప్రస్తుతం 1089.9(80.05 టీఎంసీలు) అడుగుల నీరు నిల్వ ఉందని అధికారులు తెలిపారు.

గేట్లు ఎత్తి.. మూసిన అధికారులు

సోమవారం రాత్రి వరకు 25వేల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో రాగా, క్రమంగా 42వేలకు పెరగడంతో మంగళవారం ఉదయం 5 గంటలకు 5 వరద గేట్లను ఎత్తి దిగువకు 15 వేల క్యూసెక్కుల నీటిని విడుదల చేయడం ప్రారంభించారు. మధ్యాహ్నానికి 55 వేల క్యూసెక్కులకు ఇన్‌ఫ్లో పెరగడంతో 9 వరద గేట్లను ఎత్తి 28 వేల క్యూసెక్కుల నీటిని దిగువకు వదిలారు. రాత్రి సమయంలో ఇన్‌ఫ్లో 26వేల క్యూసెక్కులకు పడిపోవడంతో మొత్తం గేట్లను మూసివేశారు.

పర్యాటకులకు వసతులు కల్పించాలి

బోధన్‌ ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి



ప్రాజెక్టు పరిసరాలను పరిశీలిస్తున్న సుదర్శన్‌రెడ్డి

నిజాంసాగర్‌: నిజాంసాగర్‌ ప్రాజెక్టు సందర్శనకు వస్తున్న పర్యాటకులకు కనీస వసతులు కల్పించాలని బోధన్‌ ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి అధికారులకు సూచించారు. మంగళవారం ఆయన నిజాంసాగర్‌ ప్రాజెక్టును సందర్శించారు. స్థానిక అధికారులతో మాట్లాడి ఇన్‌ఫ్లో, ఔట్‌ఫ్లో వివరాలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పొరుగు రాష్ట్రాలతో పాటు పక్క జిల్లాల నుంచి నిజాంసాగర్‌ ప్రాజెక్టును సందర్శించడానికి చాలా మంది వస్తుంటారన్నారు. వారికి అవసరమైన వసతులు కల్పించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. పర్యాటక ప్రాంతంగా అభివృద్ధి చేయడం కోసం ప్రతిపాదనలు సిద్ధం చేయాలని అధికారులకు సూచించారు. ఆయన వెంట ఉర్దూ అకాడమీ చైర్మన్‌ తాహెర్‌ బిన్‌ హందాన్‌, కాంగ్రెస్‌ నాయకులు శ్రీనివాస్‌, శంకర్‌, నరేందర్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

నమ్మితే నట్టేట ముంచిన మిత్రుడు

- పొలం రిజిస్ట్రేషన్‌ చేయాలని కోరితే తనపేరిట చేయించుకున్న వైనం
- నిజం తెలిసి మానసిక వేదనకు గురై ఆత్మహత్య చేసుకున్న బాధితుడు

ఖలీల్‌వాడి: నమ్మిన స్నేహితుడు మోసం చేశాడనే మనస్తాపంతో ఒకరు ఆత్మహత్య చేసుకున్న ఘటన జిల్లా కేంద్రంలో చోటు చేసుకుంది. ఘటనకు సంబంధించి ఐదో టౌన్‌ ఎస్సై గంగాధర్‌ మంగళవారం తెలిపిన ప్రకారం వివరాలిలా ఉన్నాయి. నాగారంలోని 80 క్వార్టర్స్‌లో నాగరాజు(54) మాధవిలు నివాసం ఉంటున్నారు. మాధవి పెద్దమ్మకు సంతానం లేకపోవడంతో రూరల్‌ మండలంలోని ముత్తకుంటలో ఉన్న 20 గుంటల పొలాన్ని మాధవిపై రిజిస్ట్రేషన్‌ చేసేందుకు ఆమె సిద్ధమైంది. ఈ విషయాన్ని నాగరాజు తన మిత్రుడు మల్లేశ్‌కు చెప్పి తన భార్య మాధవి పేరిట పొలం రిజిస్ట్రేషన్‌ చేయాలని కోరాడు. ఇదే అదునుగా భావించిన మల్లేశ్‌.. నాగరాజు భార్య మాధవి పేరుపై కాకుండా తన పేరిట రిజిస్ట్రేషన్‌ చేయించుకున్నాడు. వీరు లోన్‌ కోసం బ్యాంక్‌కు వెళ్తే ఆ భూమి మాధవి పేరిట లేదని తెలిసి కంగుతిన్నారు. ఇదేంటని నాగరాజు దంపతులు మల్లేశ్‌ని ప్రశ్నిస్తే అతను బెదిరించాడు. దీంతో వారు రూరల్‌ పీఎస్‌లో మూడు నెలల క్రితమే ఫిర్యాదు చేసినట్లు తెలిసింది. సివిల్‌ కేసు కావడంతో పోలీసులు పట్టించుకోలేదనే ఆరోపణలు ఉన్నాయి. దీంతో కొంత కాలంగా మానసిక ఒత్తిడికి గురయ్యాడు. కాగా సోమవారం రాత్రి ఇంట్లో ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడి నాగరాజు భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

మెంట్రాజ్‌పల్లిలో రోడ్డు ప్రమాదం

- బైక్‌ను ఢీకొన్న లారీ
- ఒకరి మృతి, మరొకరికి తీవ్రగాయాలు



ఘటన స్థలిలో క్షతగాత్రులు

జక్రాన్‌పల్లి: డిచ్‌పల్లి మండలంలోని మెంట్రాజ్‌పల్లి వద్ద మంగళవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి చెందగా మరొకరికి తీవ్ర గాయాలయ్యాయి. డిచ్‌పల్లి ఎస్సై ఎండీ షరీఫ్‌ మంగళవారం తెలిపిన వివరాల ప్రకారం.. జక్రాన్‌పల్లి మండలంలోని పడకల్‌కు చెందిన ఎల్లుల్ల నర్సుబాయి (72) సుద్దపల్లిలో ఉన్న తన మేనకోడలిని కలిసేందుకు వెళ్తుండగా అదే గ్రామానికి చెందిన నారాయణగౌడ్‌ డిచ్‌పల్లికి వెళ్తున్నట్లు తెలిసి అతని బైక్‌ ఎక్కింది. ఈ క్రమంలో వీరు మెంట్రాజ్‌పల్లి వద్దకు చేరుకోగానే వెనుక వచ్చిన లారీ ఢీకొన్నది. ఈ ఘటనలో నర్సుబాయి తలకు, నారాయణగౌడ్‌కు తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు వీరిని జిల్లా ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. కాగా నర్సుబాయి ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందింది. నారాయణగౌడ్‌ చికిత్స పొందుతున్నాడు. మృతురాలి భర్త భోజన్న ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

రోడ్డు ప్రమాదాల్లో ఐదుగురికి తీవ్రగాయాలు



ప్రమాదంలో గాయపడ్డ ముత్తి రమేశ్‌

కామారెడ్డి రూరల్‌: జిల్లా కేంద్రంలోని క్యాసంపల్లి శివారులో ఎదురెదురుగా వస్తున్న రెండు బైకులు ఢీకొన్న ఘటనలో ముగ్గురికి తీవ్ర గాయాలయ్యాయి. స్థానికుల కథనం ప్రకారం వివరాలిలా ఉన్నాయి. మంగళవారం సాయంత్రం సిరిసిల్లా జిల్లాకు చెందిన మాలావత్‌ దినేశ్‌ పని నిమిత్తం బైక్‌పై కామారెడ్డి వైపు వస్తుండగా.. దోమకొండ మండలం ముత్యంపేటకు చెందిన మంగళి రాములు, ముత్తి రమేశ్‌ బైక్‌పై కామారెడ్డి నుంచి స్వగ్రామానికి వెళ్తుండగా క్యాసంపల్లి శివారులోని పెట్రోల్‌ బ్యాంకు సమీపంలో రెండు బైకులు ఢీకొన్నాయి. ఈ ఘటనలో బైకులపై ఉన్న ముగ్గురికి తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు చికిత్స నిమిత్తం వీరిని కామారెడ్డి జిల్లా ఆస్పత్రికి తరలించారు. కాగా వీరి పరిస్థితి విషమంగా ఉండడంతో ముగ్గురిని హైదరాబాద్‌కు తరలించారు. ఈ విషయమై దేవునిపల్లి ఎస్సై రాజును వివరణ కోరగా తమకు సమాచారం అందలేదని తెలిపారు.

వర్నిలో..



వర్ని: రెండు బైక్‌లు ఎదురెదురుగా ఢీకొన్న ఘటనలో ఇద్దరికి గాయాలైన ఘటన మండల కేంద్రంలో మంగళవారం చోటు చేసుకుంది. పాత వర్నికి చెందిన మహేశ్‌, కోటయ్య క్యాంప్‌నకు చెందిన చంద్రారావు బైక్‌లపై ప్రయాణిస్తుండగా మండల కేంద్రంలో ఎదురెదురుగా ఢీకొన్నారు. ఈ ఘటనలో బైక్‌లపై ఉన్న ఇరువురికి గాయాలయ్యాయి. స్థానికులు వీరిని ప్రైవేట్‌ ఆస్పత్రికి తరలించి చికిత్స అందించారు.

వృద్ధుడి అదృశ్యం



కృష్ణమూర్తి

ఖలీల్‌వాడి: దైవదర్శనానికి వెళ్తున్న ఓ వృద్ధుడు జిల్లా కేంద్రంలోని రైల్వేస్టేషన్‌లో అదృశ్యమైనట్లు రైల్వే ఎస్సై సాయిరెడ్డి మంగళవారం తెలిపారు. ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం.. వెస్ట్‌ గోదావరి జిల్లా భీమవరంకు చెందిన కృష్ణమూర్తి కుటుంబీకులతో కలిసి షిర్డీ వెళ్లేందుకు ఈ నెల 8న నాగర్‌సోల్‌ రైలును భీమవరంలో ఎక్కారు. 9న జిల్లా కేంద్రానికి చేరుకున్న రైలు నుంచి కృష్ణమూర్తి కుటుంబీకులు అందరూ పడుకున్న సమయంలో అదృశ్యమయ్యాడు. బాసరలో మెలకువ వచ్చిన ఆయన భార్య కృష్ణమూర్తి కోసం వెతుకగా కనిపించకపోవడంతో కుమారుడికి తెలపడంతో వారు రైల్వే పోలీసులకు ఫిర్యాదు చేశారు. వృద్ధుడి ఆచూకీ కోసం రెండు స్పెషల్‌ పార్టీలను ఏర్పాటు చేసి, జిల్లాలోని అన్ని ప్రాంతాల్లో సీసీ కెమెరాలు పరిశీలించగా ఎల్లమ్మగుట్ట కమాన్‌ నుంచి లోపలికి వెళ్లినట్లు గుర్తించారు. ఈ ఫొటోలో ఉన్న వ్యక్తి ఆచూకీ ఎవరైనా గుర్తిస్తే వెంటనే 8712658591 నంబర్‌కు ఫోన్‌ చేసి సమాచారం అందించాలని రైల్వే ఎస్సై సూచించారు.